సాక్షి
వనపర్తి
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



నేటి నుంచి ఉత్సవాలు

మద్దిమడుగులోని పబ్బతి ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



నేల ఆరోగ్యం కోసం..

నేల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు సేంద్రియ ఎరువులు వాడలని శాస్త్రవేత్తలు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.9 /16.8

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రిల్లో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మైనార్టీ సంక్షేమ అధికారిగా సుబ్బారెడ్డి



వనపర్తిటౌన్‌: కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ ఆదేశాల మేరకు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న బీరం సుబ్బారెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తానని, మైనార్టీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

పెబ్బేరు రూరల్‌: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని శ్రీరంగనాయక స్వామి ఆలయం, పెబ్బేరు మండల కేంద్రంలోని కిష్టారెడ్డిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం(వైకుంఠ ద్వార దర్శనం) ఉంటుందని ఆలయ అర్చకులు తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకుని వైకుంఠ నారాయణుడి అనుగ్రహం పొందాలన్నారు.

క్రిస్మస్‌ వేడుకల నిర్వహణకు కమిటీ


వనపర్తిటౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్‌ వేడుకలు, దుస్తుల పంపిణీ, విందు కార్యక్రమాల నిర్వహణపై చర్చించేందుకు, క్రిస్మస్‌ సెలబ్రేషన్‌ నిర్వహణ కమిటీని శుక్రవారం ఎన్నుకోనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఉదయం 11 గంటలకు కలెక్టర్‌(రెవెన్యూ) కార్యాలయానికి వనపర్తి నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లోని క్రిష్టియన్‌ మతపెద్దలు హాజరు కావాలని సూచించారు.

దేశ సంపదను దోచిపెడుతున్నారు..

నారాయణపేట: కేంద్రంలోని బీజేపీ సర్కారు రైల్వే, విమానయానం, బొగ్గు, విద్యుత్‌, బ్యాంకింగ్‌ తదితర రంగాలను ఒక్కొక్కటిగా కారు చౌకగా బడాబాబులకు విక్రయిస్తూ దేశ సంపదను లూటీ చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌ వెస్లీ, సాగర్‌ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా సమావేశం గోపాల్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలన్నింటినీ యాజమానులకు సానుకూలంగా మార్చేసి నాలుగు కార్మిక కోడ్‌లు తెచ్చారని, అవి కార్మికుల పాలిట యమపాశాలుగా మారబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు ఉద్యమంలో దేశ ప్రధాని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచ తప్పకుండా అమలు చేయాలని లేనిపక్షంలో ప్రజల తరపున పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

బీ అలర్ట్‌..

మళ్లీ కోవిడ్‌ కలకలం



- రాష్ట్రంలో జేఎన్‌–1 వేరియంట్‌ గుర్తింపు
- వైద్యారోగ్య శాఖ అధికారుల అప్రమత్తం
- మాస్క్‌ ధరించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపు
- జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు
- ఆక్సిజన్‌, మందులు, ఇంజక్షన్ల కొరత లేకుండా చర్యలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌: ప్రపంచవ్యాప్తంగా గడగడలాడించిన కోవిడ్‌ మహమ్మారి మరోసారి తరుముకొస్తోంది. రాష్ట్రంలో ఒమిక్రాన్‌ వేరియంట్‌కు చెందిన జేఎన్‌1 సబ్‌ వేరియంట్‌ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. అనుమానం ఉన్న వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కరోనా కేసులు లేవు. రానున్న రెండు, మూడు వారాల్లో పాజిటివ్‌ కేసులు పెరిగే అవకాశం ఉందనే అంచనాతో జిల్లా వైద్య శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక ఐసోలేషన్‌ వార్డు, ఐసీయూ..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్‌, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌, వనపర్తి, గద్వాల జిల్లాల పరిధిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కోవిడ్‌ ఐసోలేషన్‌ వార్డులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఐసీయూ వార్డుతో పాటు కోవిడ్‌ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఆయా జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు ఫార్మసిస్టులు ఇతర వైద్య సిబ్బందితో సమావేశమై పీపీఈ కిట్లు, డిస్పోసబుల్‌ బెడ్‌ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు, కోవిడ్‌ చికిత్సకు అవసరమైన మందులతో పాటు కోవిడ్‌ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఆర్టీపీసీఆర్‌, ర్యాపిడ్‌ టెస్టుల కిట్లు స్టాక్‌ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాల వారీగా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రుల్లో ఏర్పాట్లు ఇలా..

	మ.నగర్‌	నా.పేట	నా.కర్నూల్‌	జో.గద్వాల	వనపర్తి
ప్రత్యేక వార్డులో పడకలు	560	10	100	40	62
ఆక్సిజన్‌ సౌకర్యం ఉన్నవి	500	40	52	140	150
వెంటిలేటర్లు ఉన్నవి	60	4	37	10	24
లిక్విడ్‌ ఆక్సిజన్‌ ట్యాంక్‌	2	1	1 (పీఎస్‌ఏ)	1	-
ఆక్సిజన్‌ కాన్సంట్రేటర్లు	47	50	-	7	4
బెడ్‌సైడ్‌ కాన్సంట్రేటర్లు	47	30	26	15	-

ప్రతి బెడ్‌కూ ఆక్సిజన్‌..

కరోనా ఫస్ట్‌, సెకండ్‌ వేవ్‌లో రాష్ట్రంలో పలు ఆస్పత్రుల్లో ఆక్సిజన్‌ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా అధికారులు ముందస్తుగా జాగ్రతలు తీసుకున్నారు. అన్ని పడకలకు ఆక్సిజన్‌ సరఫరా అయ్యేలా ఇది వరకే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌ జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో రెండు (ఒకటి 13 వేల లీటర్లు, ఇంకోటి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల) లిక్విడ్‌ ఆక్సిజన్‌ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 140 ఆక్సిజన్‌ సిలిండర్లు, గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో 500 ఎల్‌పీఎం సామర్థ్యం గల లిక్విడ్‌ ఆక్సిజన్‌ ప్లాంట్‌ అందుబాటులో ఉంది.

అందుబాటులో ఉన్న ఆర్టీపీసీఆర్‌ కిట్లు ఇలా..

మహబూబ్‌నగర్‌ 521	నారాయణపేట 200
నాగర్‌కర్నూల్‌ 4,000	జోగుళాంబ గద్వాల 500
వనపర్తి 400	

పీహెచ్‌సీల్లో సైతం..

జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రులతో పాటు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం కోవిడ్‌ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గురువారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు పీహెచ్‌సీల్లో కోవిడ్‌ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఆర్టీపీసీఆర్‌, ర్యాపిడ్‌ టెస్టుల కిట్లు, కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎక్కడా మందులు, ఇంజక్షన్ల కొరత లేకున్నా.. నిల్వ చేసుకునే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు టీఎస్‌ఎంఎస్‌ ఐడీసీ నుంచి సమకూర్చుకునేలా జిల్లా వైద్య శాఖ అధికారులు ఆయా పీహెచ్‌సీల నుంచి ఇండెంట్లను తెప్పించుకుంటున్నారు.

విధిగా మాస్కులు ధరించాలి..



ఇన్‌ఫ్లూయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, దగ్గు, జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే కోవిడ్‌ పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుతం అయ్యప్ప దీక్ష సీజన్‌.. త్వరలో క్రిస్మస్‌, సంక్రాంతి పండగలు ఉన్నాయి. పిల్లలు, వృద్ధులతో పాటు అందరూ జాగ్రత్తగా ఉండాలి. విధిగా మాస్క్‌ ధరించాలి. సామాజిక దూరం పాటించాలి. కోవిడ్‌ చికిత్సకు అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఐసీయూలో వెంటిలేటర్లు, ప్రతి బెడ్‌కు ఆక్సిజన్‌ సౌకర్యం ఉంది.

– డాక్టర్‌ నరేంద్ర కుమార్‌, సూపరింటెండెంట్‌, వనపర్తి జనరల్‌ ఆస్పత్రి

ఆరు గ్యారంటీలు ప్రతి గడపకు చేరాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌

పెబ్బేరు రూరల్‌: కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రతి గడపకు చేరేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌ యాదవ్‌ సూచించారు. కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రాములు యాదవ్‌ ఆధ్వర్యంలో ఆయన గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పది సంవత్సరాలుగా ప్రతిఒక్క కార్యకర్త కష్టపడి ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నారన్నారు. ఎన్నో కేసులు ఎదుర్కొని, నాటి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు భయపడకుండా కాంగ్రెస్‌ పార్టీ జెండా పట్టి ప్రతిగడపకు తిరిగి, ప్రతి సమస్యపై పోరాటం చేశారని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్‌ పార్టీ ఈ అఖండ విజయం సాధించిందంటే మీ కృషి, మీ కష్ట ఫలితమే అన్నారు. ఈ నెల 28న కాంగ్రెస్‌ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరగబోయే గ్రామసభలను విజయవంతం చేసే బాధ్యత ప్రతిఒక్క కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, పట్టణ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు, విష్ణు, అశోక్‌కుమార్‌, రామచంద్రయ్య, బీమన్న, అశోక్‌కుమార్‌, వెంకటేష్‌సాగర్‌, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కాసుల గలగల

- ఏడాదిలో 92,385 డాక్యుమెంట్స్‌ రిజిస్ట్రేషన్‌
- ప్రభుత్వానికి సమకూరిన రూ.241.53 కోట్ల ఆదాయం
- అత్యధికంగా జడ్చర్ల, అత్యల్పంగా అలంపూర్‌లో క్రయవిక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే పెరిగిన రిజిస్ట్రేషన్లు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్స్‌ శాఖ నుంచి ప్రభుత్వానికి ఆదాయం అధికంగా సమకూరుతుంది. కొంతమేర అన్నిరకాల రిజిస్ట్రేషన్లు తగ్గినా.. ఆదాయం మాత్రం అధికంగానే వస్తోంది. దీనికి తోడు రిజిస్ట్రేషన్‌ ఫీజులు సైతం పెరగడంతో స్టాంపులు– రిజిస్ట్రేషన్‌ శాఖకు కాసుల పంట పండుతోంది. పెరిగిన రిజిస్ట్రేషన్ల ధరలతో ఆదాయం రెట్టింపు అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని 12 సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల పరిధిలో అత్యధిక ఆదాయం జడ్చర్ల కార్యాలయం నుంచి వచ్చింది. జడ్చర్లలో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం బాగా జరగడంతోపాటు జాతీయ రహదారి, హైదరాబాద్‌కు దగ్గరలో, పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో అక్కడి భూములకు మంచి డిమాండ్‌ ఏర్పడింది. దీనికితోడు ఏటా క్రయవిక్రయాలు అధికంగానే జరుగుతాయి. అతి తక్కువగా అలంపూర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయ పరిధిలో జరిగాయి. జడ్చర్లలో 15,376 రిజిస్ట్రేషన్స్‌ కాగా అలంపూర్‌లో 1,930 మాత్రమే అయ్యాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని 12 సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో ఈ ఏడాది జనవరి నవంబర్‌ వరకు 92,385 డాక్యుమెంట్స్‌ రిజిస్ట్రేషన్‌ అయితే వీటి వల్ల ప్రభుత్వానికి రూ.241.53 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా జడ్చర్ల పరిధిలో 15,376 డాక్యుమెంట్స్‌ ద్వారా రూ.57.59 కోట్లు, తక్కువగా అలంపూర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ పరిధిలో 1,930 డాక్యుమెంట్స్‌ రిజిస్ట్రేషన్‌ అయితే రూ.2.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో స్టాంపు విక్రయాల ద్వారా రూ.181.69 కోట్ల ఆదాయం, బదలాయింపు పన్ను ద్వారా రూ.22.33 కోట్లు, రిజిస్ట్రేషన్‌ సేవల ద్వారా రూ.37.50 కోట్ల ఆదాయం వచ్చింది.

జనవరి నుంచి నవంబర్‌ వరకు జరిగిన రిజిస్ట్రేషన్‌, ఆదాయం వివరాలు..

ప్రాంతం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం (రూ.కోట్లలో)
జడ్చర్ల	15,376	57.59
వనపర్తి	14,950	35.36
మహబూబ్‌నగర్‌	13,773	55.60
గద్వాల	12,958	24.76
కల్వకుర్తి	7,961	19.25
నాగర్‌కర్నూల్‌	6,997	11.86
నారాయణపేట	6,935	16.11
అచ్చంపేట	3,448	4.52
కొల్లాపూర్‌	3,107	3.90
మక్తల్‌	2,563	6.80
ఆత్మకూర్‌	2,387	3.04
అలంపూర్‌	1,930	2.68



మహబూబ్‌నగర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం

అకస్మాత్తుగా ఖాతాల్లో డబ్బులు జమ

- ఎవరు వేశారో తెలియక నేతన్నల ఆందోళన
- 168 మంది ఖాతాల్లో రూ.21,14,681లు జమ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వైనం

శాంతినగర్‌: చేనేత కార్మికుల ఖాతాల్లోకి అకస్మాత్తుగా డబ్బులు వచ్చి పడటంతో అటు ఆనందం వ్యక్తం చేయాలో లేక ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటామోనని ఆందోళన చెందుతున్నారు. రాజోళిలో 3,800 కుటుంబాలకు పైగా చేనేత మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 1,100 మగ్గాలు ఉండగా.. మంగళవారం అకస్మాత్తుగా 168 మంది ఖాతాల్లో రూ.21,14,681లు జమ అయ్యాయి. అయితే ఈ డబ్బులు ఎవరు వేశారో తెలవకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్‌ అయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన కొందరు మాస్టర్‌ వీవర్లు ఫోన్లు చేసి తామే డబ్బులు బదిలీ చేయించామని, 90 శాతం డబ్బులు తిరిగి తమ అకౌంట్లలోకి పంపాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చేనేత కార్మికులందరూ మాట్లాడుకుని సగం డబ్బులు తిరిగి పంపేందుకు ఒప్పుకుని కొందరు పంపగా.. మరికొందరు పంపలేదు. డబ్బులు పంపిన వారి ఖాతాల్లోకి తిరిగి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మళ్లీ జమయ్యాయి. అసలు డబ్బులు ఎందుకు పడుతున్నాయి.. ఎవరు పంపిస్తున్నారో తెలియక అయోమయానికి గురయ్యారు. అంతేగాక కొందరికి రూ.7 వేలు, మరికొందరికి రూ.15 వేలు, ఇంకొందరి ఖాతాల్లో రూ.25 వేల వరకు నగదు జమ కావడంతో చేనేత కార్మికులు ఆశ్చర్యపోతున్నారు. ఖాతాల్లోకి దాతలు వేశారా.. లేక సైబర్‌ నేరగాళ్ల లేక బ్లాక్‌మనీ ఉన్న వారు వేస్తున్నారా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కరోనా కాలంలో..

గతంలో కరోనా కాలంలో ఇతర రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు రాజోళి చేనేత కార్మికులు ఆర్థికంగా ఆదుకోవాలని కోరగా... ఇప్పుడు కార్మికుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి ఉంటారని కొందరు చెప్పుకుంటున్నారు. మాస్టర్‌ వీవర్స్‌ మాత్రం తామే అకౌంట్లలో డబ్బులు వేయించామని వాటిని తమకు పంపాలని ఒత్తిడి తెస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. చేనేత జౌళి శాఖ అధికారులు మాత్రం దాతలు పంపి ఉంటారని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్‌, చేనేత జౌళిశాఖ అధికారులు స్పందించి చేనేత కార్మికుల ఖాతాల్లోకి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో విచారించి.. 1,100 మంది చేనేత కార్మికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసమే మిన్న



క్రీడలను ప్రారంభిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ సంచిత గంగ్వార్‌

వనపర్తిటౌన్‌: ఆత్మవిశ్వాసం ముందు వికలత్వం చిన్నబోవాల్సిందేనని అడిషనల్‌ కలెక్టర్‌ సంచిత గంగ్వార్‌ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో వికలాంగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించారు. పోటీలను అడిషనల్‌ కలెక్టర్‌ సంచిత గంగ్వార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సకలాంగులకు తీసుపోమనే రీతిలో వికలాంగులు క్రీడల్లో నైపుణ్య స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలగడంతో పాటుగా వ్యాయామ ప్రక్రియ కూడా చేసినట్లు అవుతుందన్నారు. పోటీల్లో భాగంగా పరుగుపందెం, వీల్‌చైర్‌, చెస్‌, క్యారమ్‌, షాట్‌పుట్‌ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా సంక్షేమ అధికారి రామామహేశ్వర్‌రెడ్డి, డీవైఎస్‌ఓ సుధీర్‌ కుమార్‌ రెడ్డి, పీఈటీలు శ్రీనివాసులు, శంకర్‌, శ్రీధర్‌, రామచంద్రమ్మ, ఈశ్వరమ్మ, రంగనాయకమ్మ, శిరీష, మీసాల మోహన్‌, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చెల్లింపుల సమస్య

- నెమ్మదిగా సాగుతున్న మెడికల్‌ కాలేజీ, హాస్టల్‌ భవనాల పనులు
- 20 రోజుల్లో పూర్తికావాల్సిన నిర్మాణాలు
- నేటికి 70 శాతం పనులు పూర్తి
- రూ.184 కోట్లకు పైసా కూడా విడుదల చేయని గత ప్రభుత్వం



నిర్మాణంలోని మెడికల్‌ కాలేజీ శాశ్వత భవన సముదాయం

వనపర్తి: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.184కోట్లతో నిర్మాణంలోని మెడికల్‌ కాలేజీ శాశ్వత భవనం, హాస్టల్‌, అడ్మినిస్ట్రేషన్‌ భవనాల సముదాయం పనులు సాగుతాయా.. ఆగుతాయా.. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే భావన నెలకొంది. కాంట్రాక్టర్‌ అగ్రిమెంట్‌ ప్రకారం.. మరో 20 రోజుల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. మరో ఏడాది గడువు ఇస్తే.. గాని భవన సముదాయం వినియోగంలోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

పనులు పూర్తి చేసినా..

అధికారిక లెక్కల ప్రకారం.. 70 శాతం పనులు పూర్తి చేసినా.. ప్రభుత్వం కనీసం ఒక్క రూపాయి చెల్లింపులు చేయలేదు. కొన్ని నెలల కిందటే రూ.44 కోట్ల బిల్లుల చెల్లింపుల కోసం ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు ప్రభుత్వానికి ఎంపీ రికార్డ్‌ చేసి పంపించినా.. ప్రభుత్వం చెల్లింపులు చేయలేదు.

వచ్చే ఏడాది అందుబాటులోకి..

ఇప్పటికే.. వనపర్తి ప్రభుత్వ మెడికల్‌ కాలేజీని నర్సింగ్‌ కాలేజీ భవనంలో తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఇందులో రెండు తరగతులు నిర్వహించేందుకు మాత్రమే సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండో సంవత్సరం కొనసాగుతుండటంతో మెడిసెన్‌ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు బోధించేందుకు సరిపడా గదులు ఉన్నాయి. విద్యార్థులు మూడో సంవత్సరం వస్తే.. కొత్త భవనంలోకి మారాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం డబ్బులు చెల్లింపులు చేపట్టకపోవడంతో కంట్రాక్టర్‌ మెడికల్‌ కాలేజీ శాశ్వత భవనం సిద్ధం చేయకుంటే ఎన్‌ఎంసీ విజిట్‌ సమయంలో సదుపాయాలు లేకుంటే పరిస్థితి తిరోగమనానికి దారితీస్తోంది.



యాభై ఎకరాల్లో నిర్మాణం చేస్తున్న మెడికల్‌ కాలేజీ భవనాల ప్లాన్‌

983 మంది మెడికల్‌, హౌస్‌సర్జన్‌ విద్యార్థులకు..

ఐదేళ్ల మెడిసిన్‌ విద్యార్థులతో పాటు హౌస్‌ సర్జన్‌ విద్యార్థులు సైతం ఇక్కడ హాస్టల్‌లో ఉంటూ.. నైపుణ్యం పెంచుకునేలా భవన సముదాయాల ప్లానింగ్‌, ఎస్టిమేట్‌ను గత ప్రభుత్వం తయారు చేసింది. మొత్తం 983 మంది విద్యార్థులు ఏకకాలంలో బాలురు, బాలికలు వేర్వేరు హాస్టల్‌ భవనాల్లో ఉండేందుకు వీలుగా భవన సముదాయం నిర్మాణం చేస్తున్నారు.

భవనాలు ఇలా...

కాలేజీ భవనం: ఎల్‌జీఎఫ్‌, యూజీఎఫ్‌, 3 ఫ్లోర్స్‌, టెర్రస్‌, పోర్చ్‌లకు 1,61,876 చదరపు ఫీట్ల వైశాల్యం.

బాలికల హాస్టల్‌ భవనం: గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఆరు అంతస్తుల భవనం, టెర్రస్‌ 91,354 చదరపు ఫీట్ల వైశాల్యం.

బాలుర హాస్టల్‌: గ్రౌండ్‌ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవనం, టెర్రస్‌

కిచెన్‌, డైనింగ్‌: గ్రౌండ్‌ ఫ్లోర్‌, హాల్‌ 81,115 చదరపు ఫీట్ల వైశాల్యం.

పీజీ విద్యార్థుల కోసం: గ్రౌండ్‌ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవనం 24,180 చదరపు ఫీట్ల వైశాల్యం.

ప్రిన్సిపాల్‌, సూపరింటెండెంట్‌ క్వాటర్స్‌, గెస్ట్‌హౌస్‌: గ్రౌండ్‌ ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తుల్లో నివాస గృహాలు, ప్రత్యేకంగా 7 సూట్లు 10,719 చదరపు ఫీట్ల వైశాల్యంలో నిర్మాణం చేస్తున్నారు.

వచ్చే విద్యాసంవత్సరం వరకు పూర్తి



చెల్లింపుల సమస్యతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. మొదటి బిల్‌ పేమెంట్‌ ప్రభుత్వం విడుదల చేస్తే.. పనుల్లో వేగం పెంచి వచ్చే విద్యాసంవత్సరం మెడికల్‌ కాలేజీ మూడో సంవత్సరం విద్యార్థులు వచ్చేనాటికి హాస్టల్‌ భవనాలు, కాలేజీ భవనం సిద్ధం చేసి ఇస్తాం. ఈ పనులను ప్రస్తుత ప్రభుత్వం యథావిధిగా కొనసాగించవచ్చు.

– దానయ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, వనపర్తి



చాంపియన్‌గా నిలిచిన అండర్-14 నెట్‌బాల్ బాలుర జట్టు



రన్నరప్‌గా నిలిచిన అండర్-17 జట్టు

నెట్‌బాల్‌లో మెరిసిన పాలమూరు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాయి. అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర జట్టు చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో బాలుర జట్టు 14-3 పాయింట్ల తేడాతో ఖమ్మంపై విజయం సాధించింది. అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఇరు జట్లను ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు. భవిష్యత్‌లు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

భక్తుల కొంగు బంగారం..

పబ్బతి హనుమాన్



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

- మద్దిమడుగు క్షేత్రంలో నేటి నుంచి దీక్ష విరమణ ఉత్సవాలు
- 26న హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం



ప్రత్యేక అలంకరణలో పబ్బతి హనుమాన్

అమ్రాబాద్: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మద్దిమడుగులో దీక్షా మాల విరమణ ఉత్సవాలు శుక్రవారం నుంచి 26 వరకు వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ వెలిసిన పబ్బతి ఆంజనేయ స్వామిని పిలిస్తే పలికే దైవంగా, కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు పూజిస్తారు. నల్లమల కొండల్లో ప్రకృతి రమణీయ ప్రదేశంలో వెలిసిన అంజన్న క్షేత్రం శ్రీశైలానికి ఉత్తర దిశగా ఉంటుంది. ఈ ఆలయానికి వేల ఏళ్ల చరిత్ర ఉందని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మద్దిమడుగులో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మాల విరమణ భక్తులకు ప్రత్యేకషెడ్లు ఏర్పాటు చేశారు. నీటి సమస్య లేకుండా (సింతటిక్) మినీ ట్యాంకులు ఉన్న స్నాన ఘట్టాలతో పాటు మరో 24 స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. పదరప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నల్గొండ, హైదరాబాద్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి మాల ధరించిన స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో మాచర్ల, దేవరకొండ, మిర్యాలగూడా, అచ్చంపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపనున్నారు.

ఏటా రెండుసార్లు ఉత్సవాలు

మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఏటా రెండు పర్యాయాలు జరుగుతాయి. కార్తీక మాసంలో దీక్షమాల విరమణ, చైత్రమాసంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయ స్వామి మాలను ధరిస్తారు. 40 రోజుల కఠోర దీక్ష అనంతరం ఇరుముడులతో ఆలయం వద్దకు వచ్చి స్వామివారికి సమర్పించి దీక్ష విరమణ చేస్తారు.

ఉత్సవాల వివరాలు..

- 22న ఉదయం నిత్యార్చన, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం, ద్వజారోహణ
- 23 విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ హోమం, రుద్రహోమం, సహస్రనామార్చన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, నిత్యోపాసన, మన్యుసూక్తహోమం, తీర్థప్రసాద వితరణ, రాత్రికి అమ్మవారి సేవ
- 24న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, బలిహరణ, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పములు, శివపార్వతుల కల్యాణం
- 25న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతరపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, హనుమత్ వ్రతం, తీర్థ ప్రసాదవితరణ, సీతారాముల కల్యాణం
- 26న గవ్యాంతపూజలు, ఆంజనేయ స్వామికి 108 కలశాలతో అభిషేకం, హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు.

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి మృతి

జడ్చర్ల: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నెక్కొండలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెక్కొండకు చెందిన శివయ్య(28) తెల్లవారుజామున నిద్రలేచి వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన మృతిపై భార్య మంజుల, బంధువులు అనుమానంతో ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త ఆత్మహత్య చేసుకోలేదని, తనకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు అంగీకరించకపోవడంతో సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పోస్టుమార్టం నివేదిక మేరకు దర్యాప్తు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాద్వార్‌లో విషాదం

మక్తల్: కూతురి పుట్టినరోజు సందర్భంగా కేక్ తెచ్చేందుకు వెళ్లిన తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం తీవ్ర విషాదం రేపింది. ఈ ఘటన మక్తల్ మండలం మాద్వార్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాద్వార్‌కు చెందిన తుంగరాము (30) తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి కేక్ తెచ్చేందుకు అదే గ్రామానికి చెందిన రఘుతో కలిసి బైక్‌పై మక్తల్‌కు వెళ్లి వస్తుండగా.. గ్రామ సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. తుంగ రాము మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య నవీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆచారి తెలిపారు.

మొసలి కలకలం



గట్టు: గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామశివారులో గురువారం మొసలి సంచారం కలకలం రేపింది. నెట్టెంపాడు కాల్వ సమీపంలోని రైతు పోతుల రామయ్య పొలంలో ఉన్న నీటిగుంతలో మొసలి కనిపించడంతో సమీప వ్యవసాయ పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు, గొర్రెలు, చిన్న పిల్లలు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మొసలి బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

భూ తగాదాపై కేసు నమోదు

జడ్చర్ల: బూరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న భూమి విషయంలో బుధవారం జరిగిన దాడి ఘటనపై గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. బాధితుడు గూళ్ల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివవరించారు. కాగా నిందితులు విచక్షణా రహితంగా కర్రలతో దాడులు చేశారని చర్యలు చేపట్టాలని బాధితుల తరఫున గ్రామస్తులు సీఐ కలిసి విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

పరిహారం చెల్లించాలని ఆందోళన



కొల్లాపూర్‌లోని ఆస్పత్రి ఎదుట గూమిగూడిన మృతురాలి బంధువులు

- కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యురాలితో వాగ్వాదం
- ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వైద్యురాలు
- రాజీకుదిర్చిన మధ్యవర్తులు

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోం వద్ద గురువారం కొందరు ఆందోళనకు దిగారు. బాలింత మృతికి మీ నిర్లక్ష్యమే కారణం అంటూ వైద్యురాలితో వాగ్వాదానికి దిగారు. ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. చివరికి మధ్యవర్తులు రాజీ కుదిర్చారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం యాపట్లకి చెందిన రజిత(21)కు ఏడాదిన్నర కిందట చారకొండ మండలం తుర్కలపల్లికి చెందిన సురేష్‌తో వివాహమైంది. రజిత గర్భిణి కావడంతో కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో ఈ నెల 3న ఆమెకు కాన్పు చేయించారు. సాధారణ కాన్పులో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. హెర్నియా సమస్య కారణంగా ఆమె ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రి వైద్యురాలు మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ కూడా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఈ నెల 16న మృతిచెందింది. మృతురాలి కుటుంబీకులు కొందరు స్థానిక నాయకులతో కలిసి గురువారం సంబంధిత డాక్టర్ వద్దకు వెళ్లారు. రజిత అమ్మమ్మగారి ఊరు పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం కావడంతో ఆ మండలానికి చెందిన హరిప్రసాద్, గోపినాయక్, తెలంగాణ దళితదండు నాయకులు బచ్చలకూర బాలరాజు మృతురాలి కుటుంబం తరఫున వైద్యురాలితో మాట్లాడారు. సరైన వైద్యం అందకపోవడంతోనే ఆమె మృతిచెందింది. ఆమె బిడ్డకు తల్లి లేకుండా పోయింది. ఆ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో వైద్యురాలిపై కొందరు దురుసుగా మాట్లాడారు. దీంతో ఆమె వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లింది. పట్టణానికి చెందిన ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ఆమెకు సంఘీభావంగా స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో వైద్యురాలికి, మృతురాలి తరఫున వచ్చిన వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు కొందరు జోక్యం చేసుకుని ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. రూ.లక్ష పరిహారం చెల్లించేలా వైద్యురాలిని ఒప్పించినట్లు తెలిసింది. అయితే పరిహారం చెల్లింపు విషయంలో ఎటువంటి స్పష్టత రాలేదని, శుక్రవారం మరోసారి చర్చలు జరుపుతామని మృతురాలి తరపు వారు తెలిపారు. ఈ ఘటనపై ఇరువర్గాలు తమకు ఎటువంటి ఫిర్యాదులు ఇవ్వలేదని ఏఎస్‌ఐ రామస్వామిగౌడ్ తెలియజేశారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచాలి



విద్యార్థులు తయారు చేసిన వాహనాన్ని పరిశీలిస్తున్న బృందం

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ

కోస్గి: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించడంతో పాటు, పరిశోధనలపై ఆసక్తి పెంచి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 'సృజన టెక్‌ఫెస్ట్-2023' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి సంవత్సరం మెకానికల్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించే సృజన టెక్‌ఫెస్ట్-2023 కార్యక్రమాన్ని ఈ ఏడాది కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించగా.. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, వడ్డేపల్లి, కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఇచ్చిన ప్రాజెక్టుల్లో మహబూబ్‌నగర్ కళాశాల విద్యార్థులు ఇచ్చిన ఎలక్ట్రిక్ గో కార్ట్ ప్రదర్శన ప్రథమ బహుమతి పొందగా.. కోస్గి కళాశాల విద్యార్థులు ఇచ్చిన డ్యూయల్ ఆక్సిస్ స్టీరింగ్ మెకానిసమ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల మెకానికల్ విభాగాధిపతి సత్యయ్య తెలిపారు. ప్రతిభ చూపిన ఈ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కార్యక్రమానికి హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పరమేశ్వరీ ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఇందులో ఆయా కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజ్ చేసినా.. మద్యం బార్ నిర్వహణ

జడ్చర్ల: ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన మద్యం బార్ యథావిధిగా కొనసాగడం జడ్చర్లలో చర్చనీయాంశంగా మారింది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఓ స్టార్ హోటల్లో నిర్వహిస్తున్న బార్ నుంచి గత నెల 15న ఎన్నికల సమయంలో నిబంధనలను ఉల్లంఘించి డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా మద్యం తరలిస్తుండగా జీఎస్టీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బార్‌లో ఉండాల్సిన మద్యం కాటన్లు ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా బయటకు తరలించడంపై ఎక్సైజ్ అధికారులు విచారించి బార్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారుల నిబంధనలను బేఖాతరు చేస్తూ బార్‌ను నిర్వాహకులు యథావిధిగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరులు ఎక్సైజ్ సీఐ బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. తాము మద్యం బార్‌ను సీజ్ చేశామని, బార్‌ను మళ్లీ యథావిధిగా కొనసాగిస్తుండడంపై తమకు తెలిసిందన్నారు. మరోసారి విచారించి బార్‌ను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

హాకీ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా గోటూరు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో గురువారం హాకీ తెలంగాణ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గోటూరు శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుతం హాకీ మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. లాల్‌కోట జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఈయన ఎంపికపై వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

సృజనాత్మకత పెంపే లక్ష్యం

- రాష్ట్రస్థాయికి ఎంపికైన పెబ్బేర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు




వనపర్తిటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వారు ఎంచుకున్న సబ్జెక్టులో పెంపే లక్ష్యంగా సైన్స్‌ఫెయిర్ తరహా ప్రదర్శనలకు సాంకేతిక విద్యాశాఖ శ్రీకారం చుట్టిందని వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సుల విభాగాలకు చెందిన ఉమ్మడి కళాశాలల విద్యార్థులకు సృజన టెక్ ఫెస్ట్ పేరిట గురువారం పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, పెబ్బేరు(మహిళ కళాశాల) నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుకు ఆరుగురు చొప్పున విద్యార్థులు నమూన ప్రదర్శనలు తీసుకొచ్చారు. ఈ నమూనా ప్రదర్శనలో పెబ్బేర్ కళాశాల విద్యార్థులు శబ్దం నుంచి విద్యుత్ తయారు చేసే ప్రాజెక్టు చేపట్టారు. ఈ ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. న్యాయనిర్ణేతలు బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ కార్తీక్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ ఈసీఈ హెడ్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

గుట్టుగా గుప్తనిధుల తవ్వకాలు



లింగాల శివారులో గుప్త నిధులకు కోసం త్రవ్వకాలు జరిపి రాత్రికి రాత్రే చదును చేసిన ప్రదేశం



లింగాల శివారులోని పోచమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు(ఫైల్)

- కొనసాగుతున్న దేవతావిగ్రహాల ధ్వంసం
- గతంలో పోచమ్మ, నంది విగ్రహాలు ధ్వంసం
- నేడు లింగాల శివారులో మరో గుప్త నిధుల తవ్వకాలు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పరిసర ప్రాంతాల్లో వివిధ దేవతామూర్తుల విగ్రహాల ధ్వంసం కొనసాగుతూనే ఉంది. లింగాలకు సమీపంలోని చాకిరేవుకుంట దగ్గర ఈ నెల 19న రాత్రి కొంతమంది గుర్తు తెలియని దుండగులు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తవ్వకాలు చేసిన ప్రాంతంలో రాత్రికి రాత్రే జేసీబీతో చదును చేయిండంలో అనుమానాలకు తావిస్తోంది. 2022 మే 31 రాత్రి చెన్నంపల్లి వెళ్లే దారిలో శివాలయం ఎదుట ఉన్న నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనలో అప్పట్లో పదుల సంఖ్యలో అనుమానితులను విచారించినా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన నంది విగ్రహం ఎక్కడ ఉందో కూడా నేటికి తెలియలేదు. అప్పట్లో దాతలు ముందుకు వచ్చి నంది, శివలింగం విగ్రహాలను మళ్లీ పున:ప్రతిష్ఠించారు. ఇది జరిగి నెల రోజులకే 2022 జూలై 12 రాత్రి లింగాల శివారులో గ్రామ దేవత పోచమ్మ దేవాలయంలో పోచమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దేవాలయాలపై దుండగులు దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం ఎవరికి అంతుపట్టడం లేదు. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తే మరి విగ్రహాలు ఎత్తుకెళ్లడం ఎందుకనే ప్రశ్నలు మొదలయ్యాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని పలు చెంచు పెంటల్లో గుప్త నిధుల వేట గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. నల్లమల ప్రాంతంలో పూర్వకాలంలో రాజులు నిర్మించిన ఎన్నో దేవాలయాలు, కోటలు శిథిలావస్థకు చేరడం, గుప్త నిధుల తవ్వకాలకు నిలయంగా మారుతున్నాయి. ఈ సమయంలో పోలీసులు ఉదాసీనత వహిస్తుండడంతో గుళ్ల, గోపురాలకు భద్రత లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేల ఆరోగ్యానికి సేంద్రియ ఎరువులు

- పంట అవశేషాలతో తయారీ
- కోరమాండల్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ డా.సుబ్బారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న డా. జీవీ సుబ్బారెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయ భూమిని బలంగా, ఆరోగ్యంగా తయారు చేసుకోవడానికి రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వినియోగించాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రసిడెంట్ డా. జీవీ సుబ్బారెడ్డి సూచించారు. పంటలోని అవశేషాలను, పంట కోత అవశేషాలను సరియైన పద్ధతిలో వినియోగించడంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చన్నారు. గురువారం పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా.పి రఘురామిరెడ్డి మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించి అవసరమైన రసాయనిక ఎరువులను వినియోగించాలని, అధికారులు సూచించిన మో తాదులో వాడాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఆయా పంటల్లో ఆయా పద్ధతుల్లో వినియోగించాలన్నారు. రైతులు వ్యవసాయాన్ని వ్యాపార ధోరణిలో చూడాలని, అప్పుడే అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. ఆయా సాగు పంటలో కలుపు నివారణ పద్ధతులు వేర్వేరుగా ఉంటాయని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఉపయోగించి నివారించాలన్నారు. పంటల సాగులో రైతులు శారీరక శ్రమను తగ్గించడానికి యాంత్రీకరణను ఎక్కువగా వినియోగించాలని, దీనిపై రైతులు మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను రైతులు పరిశీలించారు. రైతుసదస్సుకు విశ్వవిద్యాలయం డీన్ ఆఫైర్స్ డా.సత్యనారాయణ, పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.మల్లారెడ్డి, కేవీకే కో ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, డీఏఓ చంద్రశేఖర్, కోరమాండల్ ప్రతినిధి డా.సుధాకర్, శాస్త్రవేత్తలు డా.కే. శ్రీధర్, డా.వాణిశ్రీ పాల్గొన్నారు.

'మత్స్య సహకార' సమరం



సొసైటీ సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను అందజేస్తున్న రఘునందన్‌రావు

- 31న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల

కందనూలు: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నగారా మోగింది. ఈనెల 31న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ పాత సొసైటీ కార్యాలయంలో కోఆపరేటివ్ ఎన్నికల జిల్లా అధికారి, ఆడిట్ ఆఫీసర్ రఘునందన్‌రావు అధ్యక్షతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఎన్నికలు రెండు నెలల కిందట నిర్వహించాల్సి ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శితో పాటు 11 డైరెక్టర్ స్థానాలు ఉన్నట్లు తెలిపారు.

నోటిఫికేషన్ వివరాలు ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా కమిటీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు 27న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నామినేషన్ దాఖలు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. 31న ఉదయం 8గంటల నుంచి ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో 223 గ్రామాల మత్స్య సహకార సంఘాల సొసైటీ అధ్యక్షులు ఓటర్లుగా ఉండనున్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ప్రమోటర్ వాకిటి ఆంజనేయులు, ప్రమోటర్ తుమ్మల అల్లోజీ, గొడుగు సహదేవుడు, పెబ్బేటి నిరంజన్, పర్వతాలు, సత్యం, నాయకులు హరికృష్ణ, చాపల స్వామి, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరోనాపై అప్రమత్తతగా ఉండాలి

వీపనగండ్ల: కరోనా వైరస్ తిరిగి వ్యాప్తి చెందుతుందన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ సూచించారు. ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని గ్రామాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, మాస్కులు ధరించడంతో పాటు వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.

అందుబాటులో సబ్సిడీ చాప్ కట్టర్లు

గోపాల్‌పేట: ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీలో చొప్ప కత్తిరించే మిషన్లు అందుబాటులో ఉన్నాయని గోపాల్‌పేట మండల వెటర్నరీ డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 హెచ్‌పీ మూడు బ్లేడ్లకు రైతువాటా రూ.31 వేలు, 3 హెచ్‌పీ 3 బ్లేడ్లు సింగిల్‌ఫేస్ మిషన్‌కు రైతువాటా రూ.36,500, 3 హెచ్‌పీ 3 బ్లేడ్లు త్రీఫేస్ మోటార్ కోసం రైతువాటా రూ.38వేలు కట్టాల్సి ఉంటుందని తెలిపారు. కావాల్సిన రైతులు డీవీఏహెచ్‌ఓ, వనపర్తి పేరు మీద డీడీ తీసి దరఖాస్తు ఫారం నింపి స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో అందించాలని కోరారు. ఈ అవకాశం కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ తో పాటుగా తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ ఇన్‌చార్జ్, వార్డెన్ సత్యనారాయణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ స్టడీమెటీరియల్ తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ట్యూటర్ అర్జున్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను కలవడంపై రాజకీయం తగదు'

అమరచింత: మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిస్తే దానిని రాజకీయ కోణంలో తప్పుడు ప్రచారం చేయడం సబబు కాదని మండల వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ మస్తీపురం ఎంపీటీసీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన తాను ప్రస్తుతం మండల పరిషత్ వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నానని తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలని కోరుతూ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేను కలిస్తే దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు తనపై రాజకీయ విమర్శలు చేయ్యడం ఎంత వరకు సమంజసం అన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని వైస్ ఎంపీపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మురళీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల భవన నిర్మాణానికి భూమిపూజ



ఆత్మకూర్: వాల్మీకుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి గురువారం మాదిరెడ్డి పద్మజా జలంధర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మున్సిపాలిటీలోని మూడో వార్డులో వాల్మీకుల కమ్యూనిటీ భవనం నిర్మించుకునేందుకు ఆర్థికంగా సహకరించాలని వాల్మీకుల సంఘం నాయకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని సంప్రదించారు. ఈ నేపథ్యంలో జలంధర్‌రెడ్డి సతీమణి గురువారం నిర్వాహకులకు రూ.2 లక్షలు విరాళంగా అందజేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, బీజేపీ నాయకులు నాగేందర్‌రెడ్డి, రేచింతల శ్రీను, గాడిశేషు, రఘుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, వాల్మీకి సంఘం నాయకులు ఎస్టీడీ శ్రీనివాసులు, వెంకటన్న, మండ్ల విజయ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

'సోలార్' నిర్వహణలో నిర్లక్ష్యం

- పలు గ్రామాల్లో నిరుపయోగంగా సోలార్ లైట్లు
- పంచాయతీలకు తప్పని తిప్పలు
- మోతెక్కిస్తున్న విద్యుత్ బిల్లులు



పెద్దదగడలో శిథిలావస్థకు చేరి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న సోలార్ స్ట్రీట్ లైట్లు



పెద్దదగడలో వెలగని సోలార్ లైట్లు

చిన్నంబావి: గ్రామ పంచాయతీల్లోని వీధుల్లో ఏర్పాటు చేసే విద్యుత్ దీపాలకు ఏడాదికి రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఒక్కోసారి గ్రామ పంచాయతీలకు వచ్చే కొద్దిపాటి ఆదాయంలో ముప్పై శాతం వరకు విద్యుత్ బిల్లులకు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో సోలార్ లైట్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం తప్పుతుందని మండలంలోని పెద్దదగడ, అయ్యవారిపల్లి, లక్ష్మీపల్లి, బెక్కెం, పెద్దమారు, వెల్టూరు గ్రామాల్లో గ్రామ పంచాయతీ పాలక వర్గ సహకారంతో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

ప్రత్యేక ప్రణాళికతో..

మండలంలోని పెద్దదగడ, అయ్యవారిపల్లి, లక్ష్మీపల్లి, వెల్టూరు, పెద్దమారు, మియాపూర్ గ్రామాల్లో వాటర్‌సెడ్ పథకం ద్వారా మంజూరైన నిధులతో పాటు కొందరు గ్రామస్తులు స్వచ్ఛందంగా అందించిన విరాళాలతో సోలార్ లైట్లను నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు రాత్రి పూట ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రధాన కూడళ్లలో ఏర్పాటుకు ప్రభుత్వం చొరువ తీసుకుంది.

బ్యాటరీల చోరీ..

సోలార్ స్ట్రీట్ లైట్స్ పని చేసినట్లయితే ఆయా గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల భారం తప్పేది. కానీ వీటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో కొన్ని స్ట్రీట్ లైట్ల సోలార్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఆయా పంచాయతీల్లో ప్రతి ఏటా రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వెంటనే సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తగన చర్యలు తీసుకోని సోలార్ స్ట్రీట్ లైట్లకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి..



బ్యాటరీలు ఉన్న కొన్ని లైట్లకు ఇటీవల మరమ్మతు చేశాం. కానీ వాటిలో బ్యాటరీల నాణ్యతలో లోపం వల్ల లైట్లు వెలగడం లేదు. చాలా వాటిలో బ్యాటరీలు పాడవడంతో పాటు మరికొన్ని చోరీకి గురయ్యాయి. అధికారులు స్పందించి వాటికి బ్యాటరీలను అందిస్తే తిరిగి వినియోగంలోకి తెస్తాం. ఈ లైట్లు పనిచేస్తే గ్రామ పంచాయతీకి కొంతమేర విద్యుత్ భారం తగ్గుతుంది.

– సురేందర్‌సింగ్, సర్పంచ్, పెద్దదగడ

లైట్లు పని చేయడం లేదు..



గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల నిర్వహణ లేక అవి పని చేయడం లేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే పంచాయతీకి నిధులు కేటాయించి వెంటనే మరమ్మతు చేపట్టాలి.

– రమేష్, పెద్దదగడ

మేలు రకం మిరప విత్తనంతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న యూస్ అగ్రీసీడ్ ప్రతినిధి

అమరచింత: మిరప పంటను సాగుచేస్తున్న రైతులు మేలు రకమైన ఎస్‌డబ్ల్యూ 450 రకం విత్తనాన్ని వాడటం ద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని యూస్ అగ్రిసీడ్ ప్రతినిధి పులుగు సురేష్ తెలిపారు. యూస్ అగ్రిసీడ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మస్తీపురం శివారులో రైతులు సాగు చేసిన ఎస్‌డబ్ల్యూ450 రకం మిరప పంటను వారు సందర్శించారు. ఈమేరకు రైతులతో సమావేశం నిర్వహించి సాగులో కలిగిన ఇబ్బందులు, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతు వెంకటేష్ మాట్లాడుతూ తన పొలంలో ఎస్‌డబ్ల్యూ 450 రకం విత్తనం నాటడం వల్ల ఎకరం పొలంలో ప్రస్తుతం మూడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈరకం విత్తనం తెగుళ్లను ఎదుర్కొంటుండడంతో మందులు పిచికారీ చేసే బాధ తప్పుతుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలేవి?



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: ఏడాది వ్యవధిలో పలు ప్రమాదాల్లో ప్రాణాలను బలిగొన్న మెట్టుపల్లి–అన్నారం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ కోరారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వనపర్తి నుంచి పాన్‌గల్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు అంజనగిరి నుంచి గోప్లాపూర్ వరకు సుమారు పది కిలోమీటర్ల పరిధిలో అనేక మలుపులు ఉన్నాయని ఆయా మలుపులు ఉన్నట్లు ఎలాంటి సూచక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆయా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఆర్‌అండ్‌బీ అధికారుల వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఆయా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరారు. లేనిచో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు డంబు కుర్మయ్య, మాలకుర్మయ్య, చిన్నకుర్మయ్య, చెన్నమ్మ, కురువమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న మండల మానిటరింగ్ టీం సభ్యులు

పాన్‌గల్: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నట్లు ఎఫ్ఎల్ఎన్ మండల మానిటరింగ్ టీం సభ్యులు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, మండల నోడల్ ఆఫీసర్ శ్రీరాములు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని బండపల్లి, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లితండా ప్రాథమిక, జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్)లో ఆయా పాఠశాలలో తరగతుల వారీగా తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల సామర్థ్యాలు, వర్క్ షీట్ల పరిశీలన, చదివించడం, రాయించడం అంశాలను పరిశీలన చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్పీ రాందాస్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పూజలలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో అయ్యప్పస్వాములు మహాపడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నిర్వహిస్తున్న మహాపడిపూజ కార్యక్రమానికి అయ్యప్ప మాలధారులతో పాటు వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామం అయ్యప్పనామ స్మరణంతో మారుమోగింది. గురుస్వాములు ఆహ్వానం మేరకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాపడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములను మాజీ మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ భక్తి భావంతో ప్రజలలో ఐక్యత పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుస్వాములు అశోక్‌రెడ్డి, రఘురాంరెడ్డి, వెంకటేష్, నందిమల్ల అశోక్, చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సాయి, సుజీవన్ రెడ్డి, నరేందర్, సేనాపతి, ఆంజనేయులు, చంద్రశేఖర్, అంజి, సంతోష్ తదితరులు ఉన్నారు.

పరిహారం చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌కు చెందిన వంగూరి కుర్మయ్య అనే రైతుకు విద్యుత్ శాఖ నుంచి మంజూరైన మూగ జీవాల పరిహారం రూ.40 వేల చెక్కును గురువారం సర్పంచ్ మాణికయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బయ్య యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది గ్రామంలోని మజీద్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు కుర్మయ్యకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. దీంతో విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మూగ జీవుల నష్టపరిహారం కింద పరిహారం చెక్కు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు హలీంపాష, బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య,డా.తిరుపతయ్య, కొండలయ్య, కృష్ణయ్య, రవి, రాముడు, గంగయ్య, రఘురాములు, జంపయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



మనిగిళ్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, పోలీసులు



బొల్లారంలో బడిబయటి పిల్లల వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొత్తకోట రూరల్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని సీఆర్పీ లావణ్య, హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. బడి బయట పిల్లలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దమందడి మండలం మనిగిళ్లలో సీఆర్పీ లావణ్య, హెచ్‌ఎం శంకర్‌గౌడ్ స్థానిక పోలీసుల సహకారంతో గ్రామంలో తిరుగుతూ బడికి వచ్చి మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థులు, తల్లిదండ్రులకు చదువుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ బీఆర్ఎస్ అంబేడ్కర్ చెప్పిన విధంగా చదవుతోనే పేదరిక నిర్మూలన అనే విధంగా ప్రతి విద్యార్థి చదువుకునే విధంగా చేయాలన్నారు. చదువుకునేందుకు పేదరికం అడ్డురాదని, చదువుకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే విద్యార్థులను హాస్టల్‌లో చేర్పిస్తామని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హరిశ్చంద్రగౌడ్, హెడ్ కానిస్టేబుల్ శాంతన్న, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, శ్రీరాములు ఉన్నారు.

బడిబయటి పిల్లలపై సర్వే

వీపనగండ్ల: బడిలో ఉండాల్సిన పసిపిల్లలు బడి బయట ఉండడం వల్ల వారి అమూల్యమైన జీవితాన్ని కోల్పోతారని సీఆర్పీ నాగరాజు అన్నారు. మండలంలోని బొల్లారంలో గురువారం బడి బయట ఉన్న పిల్లలపై సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. పనిలో పిల్లలను చేర్చడం వల్ల కలిగే నష్టాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడి బయటి పిల్లల వివరాలను మండల విద్యాధికారి కార్యాలయానికి అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం మంజూరు చేయాలని వినతి



పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి శివారులోని కేఎల్ఐ డీ–8 మైనర్ ఎంజే–6 కాల్వ తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందజేశారు. కాల్వ తవ్వకంలో 110 మంది రైతులు 74 ఎకరాల భూమి సంబంధించి రూ.4.20 కోట్ల పరిహారం అందాల్సి ఉందన్నారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే రైతుల ఖాతాల్లో జమచేసేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. దీంతో పాటు గ్రామంలో పంచాయతీ, పాఠశాలకు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి, పంచాయతీలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాంచందర్, వెంకటస్వామి, జగదీశ్వర్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి



చింతరెడ్డిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: దేశంలో ప్రస్తుతం వస్తున్న మార్పుకు అనుగుణంగా అధునాతన పద్ధతులతో వ్యవసాయం చేయడం వలన అధిక దిగుబడులు సాధించి రైతులు లాభాలు ఆర్జించవచ్చని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాన్ని గురువారం మండలంలోని రుక్కన్నపల్లి, దొంతికుంటతండాల్లో నిర్వహించారు. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త కొత్త పద్ధతుల్లో టెక్నాలజీని ఉపయోగించి ఎలా చేయాలనే విషయాలను ప్రజలకు వివరించారు. పంటలకు ఎరువులు, మందులు చల్లేందుకు డ్రోన్లను ఎలా ఉపయోగించాలో ప్రత్యక్షంగా చూయించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రజలకు వినిపించారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నట్లు వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె గ్రామాల్లో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తున్నదన్నారు. వ్యవసాయ పొలంలో డ్రోన్ సాయంతో మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చుక్క లక్ష్మమ్మ, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రఘు, ఏఈఓ హరిత ఉన్నారు.

మట్టి అక్రమ తరలింపు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామ శివారులోని మంగకుంట సమీపంలో ఉన్న గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. గురువారం వారు అక్కడికి చేరుకొని అనుమతి పత్రాలు అడుగగా.. పత్రాలు లేక పోవడంతో మట్టితో ఉన్న టిప్పరును పోలీసుస్టేషన్‌కు తరలించి, మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ మురళీగౌడ్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు ప్రసన్నకుమారి, ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీలు గాయత్రి, ఆవుల శైలజ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఎస్ అజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేసినా నాటి ప్రభుత్వం రేషన్‌కార్డులు గాని, ఇళ్లు, ఇంటిస్థలాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా పేద ప్రజలందరికీ రేషన్‌కార్డులు, పేర్ల మార్పు, చేర్పులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇళ్ల నిర్మాణం చేసుకొనే పేదలకు రూ.10లక్షలు, పేదలకు 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులకు పింఛన్లు పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాజు, మంత వెంకటస్వామి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో గల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 24 నుంచి 27వరకు నిర్వహిస్తుండగా.. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను గురువారం సర్పంచ్ వెంకటస్వామి గ్రామస్తులు, గ్రామ పెద్దలతో సమక్షంలో ఆవిష్కరించారు. ఏడాదికి ఒక్కసారి జరిగే చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నరేష్, విద్యాకమిటీ చైర్మన్ టైలర్ రవి, రామాంజనేయులు, బుచ్చన్న, గుడి నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మదనాపూర్, అమరచింత, ఆత్మకూర్ మండలాల బీఎల్ఓలతో సమావేశమయ్యారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్ల పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మాస్టర్‌ట్రైనర్స్ లక్ష్మీనారాయణ, శివశంకర్, డీటీ చాణిక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను అభినందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా కమిటీ

వనపర్తి టౌన్: నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని రద్దు చేయించాలని, 317 జీఓతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని కోరారు. ఈహెచ్ఎస్ (ఎంప్లాయి హెల్త్ స్కీం) సక్రమంగా అమలయ్యేటట్లు చూడాలని, పదోన్నతులు, బదిలీలు జరిపేటట్లు నూతన ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గసర్లు, నాగరాజు, ఈశ్వర్, దుర్గయ్య, రాజ్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక



సాయికృష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

వనపర్తిటౌన్: మధ్యప్రదేశ్‌లో ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ స్థాయి హాకీ పోటీలకు స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థి సాయికృష్ణ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలియజేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో యాజమాన్య సభ్యులు డాక్టర్ పి.జగదీశ్వర్, డాక్టర్ జి.వరప్రసాద్‌రావు, బి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎల్.సత్యనారాయణరెడ్డి, పీడీ విజయ్ కుమార్ విద్యార్థి సాయికృష్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు స్థానిక బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడని తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వనపర్తి టౌన్: మాజీ కౌన్సిలర్ గోర్ల ప్రేమలీల భర్త టీఆర్ఎస్ నాయకుడు గోర్ల దానేలు బుధవారం రాత్రి హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు వెంకటేష్, పాకనాటి కృష్ణ, బండారు కృష్ణ, గులాం ఖాదర్, నాయకులు ఎల్‌ఐసీ కృష్ణ, ఎర్ర శ్రీను, దళిత సంఘాల నాయకులు తదితరులు దానేలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమలీలను, కుమారులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గంధం బాలరాజు, పరంజ్యోతి, శరవంద, గంధం మదన్, డాక్టర్ దానేలు, బుచ్చన్న, బాలయ్య, లెక్చరర్ రంగస్వామి తదితరులు పరామర్శించారు.

చిన్నంబావి: మండలంలోని మియాపూర్, లక్ష్మీపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జల్ల రాముడు, గంగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లి యాదవ్, తేజారెడ్డి, రంజిత్‌కుమార్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిగౌడు, మహదేవ్‌గౌడు పాల్గొన్నారు.